

# ఆశ దురాశల కథ

'ఏమిట్రా ఏమైంది?'

"ఎవడో జేబు కొట్టేశాడు. వంద రూపాయలు."

"జేబు కత్తిరించాడా?"

"లేదు - వెనకాల జేబులో పెట్టుకున్నాను. ఎవడో లాగేశాడు."

సుందరం మొహం వర్షం వచ్చేముందు ఆకాశంలా, ఆందోళనగా, అశాంతిగా ఉంది....బస్‌స్టాండ్ రష్‌గావుంది.

"సార్...డబ్బులియ్యండి." కండ్రోలర్ అన్నాడు.

"కొంచెం ఆగండి...ఎవడో మావాడి జేబు కొట్టేశాడు."

హనుమంతు చెప్పాడు.

"అ...పిక్‌పాకెట్టా— అదేంటిసార్... అంత అజాగ్రత్తగా ఎలా ఉన్నారు?" కండ్రోలర్ మాట్లాడుతుంటే పాతబస్ స్టార్టయినట్టుగా భయంకరంగా ఉంది. చాలా మందికి వినిపించింది.

జనం పోగయ్యారు.

కొందరు సానుభూతి చూపిస్తున్నారు. అందరూ ఇదే విషయం చర్చించుకుంటున్నారు. కొందరు పూర్వం తమకైన అనుభవాల గురించి చెప్తున్నారు. కొందరు తమకి తెల్సిన అనుభవాల గురించి చెప్తున్నారు.

'దొంగతనాలు, నివారణ, జాగ్రత్తలు' అనే విషయంమీద ఆలిండియా రేడియో వారు చర్చా కార్యక్రమం జరుపుతున్నట్టుగా ఉంది.

సుందరం మొహం ఎండాకాలంలో పచ్చిక బీడులా కళాకాంతులు లేకుండా ఉంది.

వంద రూపాయలు పోయాయి



ఇంకా అక్కడి జనం సుందరం జేబు కొట్టెయ్యడం గురించే మాట్లాడుకుంటున్నారు.

సోడాలు అమ్మేవాళ్ళు, చక్రకేళీలమ్మేవాళ్ళు, పాలకోవా అమ్మేవాళ్లు చాలా హడావుడిగా బిజీగా ఉన్నారు.

సుందరం ఇంకా డబ్బుపోయిన షాక్ లోంచి తేరుకోలేదు.

నీడబ్బు పోయిందన్న దానికన్నా-నిన్నెవడో యీజీగా బుట్టలోవేసుకున్నాడన్నది ఎక్కువ బాధ.

పాలకోవా అమ్మే కుర్రాడొకడు-సుందరానికి కాస్త దూరంగా నిలబడి బెదురు చూపులుచూస్తున్నాడు. సుందరం ఆ కుర్రాణ్ని గమనించలేదు.

వాడే తటపటాయిస్తూ సుందరానికి దగ్గరగా వచ్చాడు. సుందరం అప్పుడు వాడికేసి చూశాడు.

పదిపన్నెండేళ్ళుంటాయివాడికి. నిక్కరు, చిరుగున్నచొక్కా తొడుక్కున్నాడు...

వీరభద్రరావ్ పమ్మి

చేతిలోపాలకోవా పాకెట్లున్న ట్రే ఉంది.

"సార్..." మెల్లిగా అన్నాడు వాడు.

"ఏమిటి?" అన్నట్టు చూశాడు సుందరం పాలకోవా కొనమంటాడేమోనని కోపం రాబోతోంది.

"మీదేకదా డబ్బు పోయింది!"


"అవును. నాదే..." సుందరానికి ఆశ్చర్యం కలిగింది.

"అదిగో-ఆ కిళ్ళీకొట్టు దగ్గర నిలబడ్డాడు, నీలం రంగు చొక్కా. ఆడే కొట్టేశాడు. నేను చూశాను. అడగండి....కానీ నేజెప్పినట్టనకండి-తర్వాత నన్ను కొడతాడు."

తొందర తొందరగా చెప్పేసి తుర్రుమని వెళ్ళిపోయాడు.

సుందరం నీలం చొక్కా-కేసి చూశాడు.
నీలం చొక్కా మంచి బట్టలు కట్టు కున్నాడు. షోగ్గా ఉన్నాడు. చూడ్డానికి దొంగలాకాక దొరలా ఉన్నాడు
సుందరం మెల్లిగా తను విన్న విషయం హనుమంతుకి చెప్పాడు అతను నీలం చొక్కా-కేసి తేరిపార చూశాడు.
వెంటనే "ఛా! వాడయ్యుండడు. చూడ్డా నికి మనకన్నా ఉన్నవాడిలా ఉన్నాడు" అన్నాడు.
మళ్ళీ హనుమంతే "పోనీ కంట్రోలర్ కి చెప్దాం" అన్నాడు.
సుందరం సరేనన్నాడు.
విషయం కంట్రోలర్ కి చెప్పాడు.అతను నీలం చొక్కా-కేసి చూశాడు.
"మీకనుమానం ఉంటే అడుగుదాం!" అన్నాడు.
"మేం అడగలేం! తీరా అతను తియ్యక పోతే గొడవ చేస్తాడేమో? కానీ పాలకోవా కుర్రాడు అబద్ధం ఎందుకు చెప్తాడు" అన్నాడు హనుమంతు.
ఆ సమయానికి డ్రైవరు, కండక్టర్ హొటల్నుంచి వచ్చి అక్కడికి చేరు కున్నారు. చాలామంది ప్రయాణీకులు కూడా చల్లగాలికోసం బస్ బైటే నిల బడ్డారు.
కంట్రోలర్ బస్ డ్రైవర్ ని పిలిచి ఏదో గుసగుసలాడాళు.
డ్రైవరు సుందరం దగ్గరకొచ్చి "అడుగు దామండీ-భయమెందుకు" అన్నాడు.
సుందరం సరేనన్నాడు.
అదిగాక పరిణామాలెలా వుంటాయోనన్న భయం కొద్దిగా ఉన్నా-ఎలాగూ బస్ లో వెళ్ళిపోతాం కదానన్న ధైర్యం సుందరానికి కలిగింది

కంట్రోలర్ నీలం చొక్కాని దగ్గరికి పిలిచి "చూడు బాబూ! ఈయన జేబు లోని వంద రూపాయలు పోయాయి. కాద-ఎవరో కొట్టేశారు ఆ పని నువ్వు చేసావని ఆయనకి అనుమానంగా ఉంది.- తీస్తే ఇచ్చేయ్" అని చాలా సౌమ్యంగా అన్నాడు.
నీలం చొకా- ముందు ఖంగుతిన్నాడు. వెంటనే తేరుకుని "ఏంటండీ - ఏం మాట్టాడుతున్నారు. నేను కొట్టేసానా? ఏం నేను జేబులు కొట్టేవాళ్ళా కనబడు తున్నానా? కాస్త తెలుసుకుని మాట్లా డండి" అన్నాడు.
అతని మాటల్లో తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోడం కన్నా దబాయింపు ఎక్కువగా కనబడింది.
కంట్రోలర్ కి అనుమానం బలపడింది.
"నువ్వు తీసావని ఆయనకి అనుమానం. పోనీ జేబుతీసి చూపిస్తే పోతుందికదా!" అన్నాడు
డ్రైవర్ అతని మాటల్ని బలపరిచాడు.
"నేను ఏలూరు వెళదామని బస్ కోసం నుంచున్నాను. బస్టాండులో ఇంతమంది ఉండగా నేనే తీసానని గారంటీ ఏవిటి!" నీలంచొక్కా గొంతు పెంచాడు.
ఈసారి డ్రైవరు కలుగజేసుకున్నాడు.
"ఆ మాటలన్నీ అనవసరం. జేబు తీసి చూపించు. ఆయనవి కొత్త పదిరూపా యల నోట్లు పైగా వరుస నంబర్లవి. నీ జేబులో లేకపోతే ఆయన పొరపాటు ఒప్పుకుని-నీకు క్షమాపణ చెప్తాడు" అన్నాడు.
సుందరం అందుకు వెంటనే ఒప్పు కున్నాడు
నీలంచొక్కా గొంతు చించుకుని గట్టిగా




మాట్లాడుతున్నాడు. వాదిస్తున్నాడు. అరుస్తున్నాడు. కాని జేబు చూపించడానికి ఒప్పుకోడంలేదు.

మాటా మాటా పెరిగింది.

పంతాలు పెరిగాయి. జనం వింత చూస్తున్నారు. "నువ్వు మర్యాదగా జేబు చూపిస్తావా-నన్నే జేబులో చెయ్యిపెట్టి వెతకమంటావా?" అనడిగాడు డ్రైవరు

"ఏంటీ జేబులో చెయ్యిపెడతావా? పెట్టు చూస్తాను" నీలచొక్కా- ఛాలెంజి విసిరాడు.

డ్రైవరు మౌనంగా ఛాలెంజి తీసుకున్నాడు.

నీలంచొక్కా-ని గట్టిగా పట్టుకుని "జేబు వెతకవయ్యా!" అన్నాడు.

నీలంచొక్కా-గుంజుకునే లోపల కంట్రోలర్ అతని ప్యాంటు జేబులో చెయ్యిపెట్టి గుప్పిట బయటకు తీశాడు.

కంట్రోలర్ గుప్పిట్లో చిన్న పాకెట్ దువ్వెన, మడతపెట్టిన జేబురుమాలు, అగ్గిపెట్టె, అన్నిటికింటా...కొత్త పద రూపాయల నోట్లు...ఉన్నాయి.

కంట్రోలర్ ఒక్కో నోటు తీసిచూశాడు. అవిపదున్నాయి. పైగా వరుస నెంబర్లో ఉన్నాయి.

"తియ్యలేదంటావురా దొంగగాడిదా" నీలంచొక్కా-ని పట్టుకుని డ్రైవర్ నాలుగు బాదాడు.

కంట్రోలర్ మరో నాలుగుబాదాడు

దొంగతనం చేసినట్టు అతను ఒప్పుకున్నాడు. చుట్టూ జనం...తలోమాట అంటున్నారు.

"గురుగారూ! వీణ్ని స్టేషన్లో అప్పజెప్పుతారా?" అనడిగాడు కంట్రోలర్.

"అ...పోలీసులచుట్టూ ఏం తిరుగుతాం లెండి! ప్రయాణం ఉంది కదా!" అన్నాడు సుందరం.

నీలంచొక్కా-కి మరోనాలుగు తగిలించి. "ఫో వెధవా-" అని చేతులు దులుపుకున్నాడు కంట్రోలర్

సుందరం మనసు హాయిగా ఉంది. ఆనందంగా ఉంది. పోయిన వంద రూపాయలు దొరికాయి. పైగా ప్రయాణం హాయిగా చెయ్యొచ్చు. హైదరాబాద్ వెళ్ళగానే డబ్బుకి తడుముకోనక్కర లేదు.

బస్ బయలుదేరడానికి ఇంకా టైముంది కంట్రోలర్ మెల్లగా భుజం మీద చెయ్యేసి సుందరాన్ని బస్ అవతలి వైపుకి తీసికెళ్లాడు.

"నేను ఇక్కడికంట్రోలర్ని...హిహిహి వంద రూపాయలు దొరికాయి కదా! హి...హి...దేశమంతా దొంగవెధవలండీ...కష్టపడి సంపాయిద్దామని

ఒక్కడికీ లేదు...హి...హి...ఏదో మీ దయ...కాస్త టిఫిన్ తిని కాఫీ తాగుతాను...మీ ఇష్టం 'ఇంత' అని నే చెప్పను. హి...హి.. మీ ఇష్టం..."

ఆతనలా అడగడం సుందరానికి నచ్చక పోయినా...పోయిన డబ్బు దొరకడం వల్ల, అతనలా నిర్మొహమాటంగా అడగ డంవల్ల...కాదనలేకపోయాడు.

అయిదు రూపాయల నోటు తీసి అతని చేతిలో పెట్టాడు.

సుందరం, హనుమంతుతో కలిసి కిళ్లీ కొట్టు దగ్గరకెళ్ళి సోడా తాగాడు. కిళ్లీ వేసుకున్నాడు.

కొట్టునుంచి బయటి కొస్తుంటే డ్రైవరు కనపడ్డాడు.

"మీరు నిజంగా అదృష్టవంతులు, పోయిన డబ్బు, అందులోను, గూడెం బస్‌స్టాండులో దొరకడమంటే నిజంగా అదృష్టం...కళ్లుమూసి తెరిచేలోపున ఊళ్ళు ఊళ్లు దాటి వెళ్ళిపోతుంది... ఆ ఏంలేదు-ఆదొంగవెధవని నేనే గట్టిగా దబాయించానుకదా!...ఏదో మీ ఇష్టం, సిగరెట్లు కొనుక్కుంటాను" అన్నాడు డ్రైవరు.

సుందరం ఓ అయిదు నోటుతీసి డ్రైవరు చేతిలో పెట్టాడు.

కండెక్టర్ బస్సెక్కి ప్రయాణీకుల్ని ఎక్కమని గంట కొడుతున్నాడు-సుందరం హనుమంతు చెయ్యిపట్టుకుని "వెడతా్నా" అని చెప్తున్నాడు-

"సార్..."

సుందరం తనని అనుకుని పక్కకి చూశాడు.

పాలకోవా కుర్రాడు.

తన డబ్బు ఎవరు కొట్టేసినదీ ఆమాకీ చ్చిన కుర్రాడు.

'అసలు వీడి విషయమే మర్చిపోయాం."

అనుకున్నాడు సుందరం.

సుందరం నవ్వుతూ ఏమిటన్నట్టుగా చూశాడు. "మీజేబు అడుకొట్టేశాడని నేనే చెప్పానుకదా!"

"అవును."

"మరి...మరి...మీ పందా దొరికాయి కదాసార్...ఓ పావలా పెట్టి పాలకోవా పాకెట్ కొనండిసార్!"

సుందరానికి నోట మాటరాలేదు.

కంట్రోలర్ నంగిమాటలు గుర్తొచ్చాయి. డ్రైవరు సన్నిహితం గుర్తొచ్చింది. కరకరలాడుతున్న కొత్త పదిరూపాయల నోట్లు జ్ఞాపకం వచ్చాయి. ఎకనామిక్స్ జ్ఞాపకం వచ్చింది. మనస్తత్వశాస్త్రం జ్ఞాపకమొచ్చింది. మార్క్స్ జ్ఞాపకం వచ్చాడు

పెట్టుబడిదారీ వ్యవస్థ జ్ఞాపకంవచ్చింది. భూమి, ఆకాశం, మనిషి, జన్మ, ఆకలి, అవసరం, ఆశ, నీతి, అవినీతి అన్నీ జ్ఞాపకం వచ్చాయి. "కష్టపడి సంపాయిద్దామని ఒక్కడికీ లేదు."

పాలకోవా కుర్రాడికేసి చూశాడు.

వాడి మొహంలో అమాయకత్వం, ఇంకా దురాశ డామినేట్ చెయ్యని పసితనం...

వాడి ట్రేలోనుంచి ఓ పాకెట్ తీసి విప్పి పాలకోవా బిళ్ళ నోట్లో వేసుకున్నాడు సుందరం.

జేబులోంచి కొత్త పదిరూపాయలనోటు తీసి వాడి ట్రేలో వేసి, వాడి జుట్టు నిమిరాడు. చిల్లర లెక్క పెడుతున్న కుర్రాడితో "ఉంచుకో" అని చెప్పి బస్సెక్కాడు.